


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



-129-

## ప్యాలెస్‌లో దొంగతనం

**కువైట్ రాజప్రాసాదం.** ఆ సమయంలో ఆ ప్రాంగణమే కాదు పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొని వుంది. రాజైన అబ్దుల్లా ప్రజారంజకుడని పేరు.

ఆయన కుమార్తె, యువరాణి అయిన అమీనాకు వివాహం నిశ్చయించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటు చూసినా కోలాహలం, సందడి నెలకొని వుంది. విలాసవంతమైన ఆభరణాలు, దుస్తులు ధరించిన రాజ బంధువులు హడావిడిగా అటూఇటూ తిరుగుతున్నారు.

చుట్టూ అమర్చిన కళాఖండాలు, దీపస్థంభాలు, పూలమాలలు ప్యాలెస్‌ను మరింత శోభాయమానం చేశాయి.

పట్టణమంతా ప్రార్థనలు జరుగుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో చరిత్రలో మిగిలేట్లు ఈ వివాహాన్ని జరిపించాలని రాజు నిశ్చయించాడు.

యువరాణి అమీనా సర్వాంగ భూషితయై పెళ్లి వేడుకకు సిద్ధమవుతోంది. ఆమెకు ప్రత్యేకంగా ఫ్రాన్స్ నుండి పెళ్ళి బట్టలు తీసుకొచ్చారు. ఇటాలియన్ నగలు వందల సెట్లు కొనుగోలు చేసారు. భారతదేశం నుండి ఏడు వారాల నగలు తెప్పించారు.అత్తరు పరిమళాలతో ఆ ప్రాంతం ఘుమఘుమలాడుతోంది.

రాకుమారి అమీనా స్నేహితురాళ్ళందరూ వారం రోజులముందే వచ్చి వివాహ వేడుకల్లో పాల్గొంటున్నారు.

సరసోక్తులతో, ఆటలు పాటలతో అలంకరణలతో, మెరుపులజిలుగులతో అలరారుతోంది ఆ మందిరం.

అంతా సజావుగా సాగుతున్నందుకు దేశ విదేశాలనుండి వచ్చిన బంధు మిత్రులు తన వైభవాన్ని కీర్తిస్తున్నందుకు పొంగిపోతున్నారు రాజు.

మూడుపూటలా బంతి భోజనాలు తిని వేలమంది జనాలు తృప్తిగా త్రేంచుతూ రాకుమారిని ఆశీర్వదిస్తున్నారు.

పనివారికి క్షణం తీరిక లేదు. పరుగులే వారికి.

ఇంతలో రాకుమారి మందిరంలో అలజడి చెలరేగింది. రాకుమారిని అలంకరించాలని చెలికత్తె సుల్తానా నగల పెట్టెను తెరిచి చూసింది.

అందులో ఉంచిన అపురూపమైన వజ్రాల హారం, ముత్యాల జత, పచ్చల గాజులు లేవు. ఆ పెట్టెలో ఒక చిన్న ఎర్ర గులాబీ రేకు మాత్రమే కనిపించింది. ఇది చూసి సుల్తానా భయంతో కేకలు వేస్తూ యువరాణికి విషయం చెప్పింది.

యువరాణి కంగారుపడి వెంటనే రాజుకు విషయం తెలియజేసింది.

విషయం విన్న రాజు అబ్దుల్లా హుటాహుటిని అక్కడికి చేరుకున్నాడు. నగలు పోయాయి అన్న విషయం విని ఆయన కోపంతో ఊగిపోయారు. పెళ్ళి కుమార్తె నగలు దొంగలించడమా..?

రాజ కుటుంబానికి ఇంత అవమానం జరగడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

అంత ధైర్యం ఎవరికుంది? దొంగ తప్పించుకోగలడా? ప్రాణాలతో బ్రతకకలడా? ఇంత సాహసం ఎవరు చేసారు?

వెంటనే ఆయన డీసీపీ ఖాలిద్‌ను పిలిపించారు. ఖాలిద్ చాలా తెలివైన, సూక్ష్మంగా ఆలోచించే డిటెక్టివ్. ఆయన వచ్చి యువరాణి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. గదిలో దొంగ ప్రవేశించినట్లు ఎటువంటి ఆధారాలు లేవు. కానీ, ఆ నగల పెట్టెలో దొరికిన ఎర్ర గులాబీ రేకు ఆయన దృష్టిని ఆకర్షించింది. ఈ క్లూ ఏంటో తెలుసుకోవడానికి ఖాలిద్ తన పరిశోధనను మొదలుపెట్టారు.

ఖాలిద్ ముందుగా యువరాణి గదిలోకి వచ్చివెళ్ళిన వారందరినీ ప్రశ్నించారు. చెలికత్తె సుల్తానా, నగల పెట్టెకు బాధ్యత వహించే భద్రతాధికారి.

అమీనాకు అలంకరించే పనివారందరినీ ప్రశ్నించినా ఎవరిపైనా అనుమానం రాలేదు. కానీ, ఖాలిద్ ఒక విషయాన్ని గమనించారు.

ఆ గదిలో నగలు భద్రపరిచే చోట అక్కడక్కడా ఎర్ర గులాబీ రేకులు పడి వుండటం గమనించారు.

వీటికి దొంగకు ఏదైనా సంబంధం వుందా అనే కోణంలో ఆలోచించారు.

ప్యాలెస్ చుట్టూ ఉన్న తోటలని పరిశీలించినప్పుడు, ఆయనకు ఒక రహస్యం తెలిసింది. రాకుమారుడు హసన్ ఎర్ర గులాబీలంటే ఇష్టపడతారని, తన ప్రియురాలికి ఎప్పుడూ ఎర్ర గులాబీలను బహుమతిగా ఇస్తుంటారని తెలుసుకున్నారు.

ఖాలిద్ అనుమానం హసన్‌పైకి మళ్ళింది. అతడి గురించి పరిశోధన చేసినప్పుడు కొన్ని విషయాలు తెలిసాయి.

హసన్ చాలా కాలంగా కువైట్ పట్టణంలోని ఒక పేద అమ్మాయిని ప్రేమిస్తున్నాడని, కానీ రాజు అబ్దుల్లా ఈ బంధాన్ని అంగీకరించలేదని ఖాలిద్‌కు తెలిసింది. తన ప్రియురాలిని పెళ్లి చేసుకోవడానికి రాజు ఒప్పుకోకపోవడంతో హసన్ ఆయనమీద కోపంతో ఉన్నారు.

తన అక్క అమీనా పెళ్లిని అంగరంగ వైభవంగా జరిపించడం అతడికి నచ్చలేదు, ఆమెకున్న అదృష్టానికి, ఆడంబరానికి హసన్‌కు అసూయ కలిగింది. తండ్రి తన ప్రేమను అంగీకరించకుండా అమీనా పెళ్ళి చేయడం అన్యాయమని భావించాడు.

తన పెళ్ళి కూడా తను ప్రేమించిన అమ్మాయితో జరిపించాలని హసన్ తన తండ్రితో వివాదానికి దిగాడు. రెండు మూడుసార్లు ఇద్దరు గొడవ పడ్డారు.

కావున ఇది ఖచ్చితంగా హసన్ చేసిన పనే అని ఖాలిద్ నిర్ణయించుకున్నాడు.

హసన్ ను పిలిచి విచారించాడు. అన్ని విధాలా ప్రశ్నించాడు. తన ప్రేమను అంగీకరించని తండ్రి పట్ల వ్యతిరేకత వుంది కానీ తన స్వంత చెల్లి అయిన అమీనా నగలు దొంగలించే నీచ స్వభావం తనది కాదని హసన్ గట్టిగా చెప్పాడు.

హసన్ లో ఎక్కడా తడబాటు కనపడలేదు. కానీ నమ్మడానికి వీల్లేదు.

మరి దొంగ ఎవరు? ఆ హసన్ మీదకు దొంగతనాన్ని నెట్టేలా గులాబీ రేకులను అక్కడ పడేసింది ఎవరు? బుర్ర గోక్కున్నాడు డిటెక్టివ్ ఖాలిద్.

ఇక వేరే విధంగా పరిశోధిస్తే తప్ప దొంగను కనిపెట్టలేమని భావించి అక్కడే వుండి మహల్ లోని వారందరినీ నిశితంగా గమనించసాగాడు.

ఆ రోజు పెళ్ళి తంతుకు ముందు జరిగే కార్యక్రమాలన్నీ క్రమంగా జరుగుతున్నాయి. పరిసరాలన్నీ పెళ్ళి వేడుకలతో సందడిగా వున్నాయి. కానీ నగల విషయం తెలిసిన వారు మాత్రం కాస్త కలవరంతో వున్నారు.

అప్పుడే అటుగా జీనత్ అనే అమ్మాయి వచ్చింది. అప్సరసలను తలదన్నే ఆమె సౌందర్యానికి ఆమె హొయలకు ముగ్ధుడయ్యాడు ఖాలిద్. కానీ అమీనాను ఆమె చూసే చూపుల్లో ద్వేషం స్పష్టంగా కనపడింది.

విచారించగా ఆమె మంత్రిగారి కూతురని తెలిసింది. ఎందుకో ఆమెను కొన్ని ప్రశ్నలు అడగాలి అనిపించింది.

మామూలుగా అరబ్ స్త్రీలు పర పురుషులతో మాట్లాడరు. కావున అడ్డుగా తెర ఏర్పాటు చేసి ఆమెతో సంభాషించాడు ఖాలిద్.

అప్పుడు తీగ లాగితే డొంకంతా కదిలింది. ఇందులో మంత్రిగారయిన అజీజ్ ఆయన కుమార్తె జీనత్ చేసిన కుట్రకోణం దాగివుంది.

అతిలోక సౌందర్యవతి జీనత్ కానీ ఆమె హృదయం మకిలి పట్టిన అద్దం అని అర్థమయింది. అందగత్తెననే అహంభావం ఆమెలో అణువణువునా వుంది. చెలికత్తెలపట్ల దురుసుగా ప్రవర్తించేది.

వయసులో రాకుమారి అమీనాకంటే ఆరునెలలే పెద్దది. కావున ఒకే తరగతిలో గురువు వద్ద వీరు ఖురాన్ చదువుకునే వాళ్ళు. ప్రతి పనినీ కలిసి చేసేవాళ్ళు. ఎక్కడికి వెళ్ళాలన్నా కలిసి వెళ్ళేవాళ్ళు.

కానీ అమీనా మనస్థత్వం మృదువైనది. ఆమె పనివారిపట్ల దయను కలిగివుండేది. అపుడపుడూ జీనత్ ను ఈ విషయంలో హెచ్చరించేది. అల్లా కృప వుండాలంటే మనుషుల పట్ల దయ కలిగి వుండాలి అని పాఠం చెప్పేది. ఇది జీనత్ కు రుచించేది కాదు.

యుక్తవయసు వచ్చాక జీనత్ హసన్ పట్ల వ్యామోహం పెంచుకుంది. ఒకరోజు హసన్ కు తన మనసులోని మాట చెప్పింది. హసన్ సున్నితంగా తిరస్కరించాడు. జీనత్ విచారించగా హసన్ ప్రేమ వ్యవహారం తెలిసింది.

రంభా ఊర్వశిలను తలదన్నే అందగత్తె అయిన తనను కాదనుకుని ఒక ఇండియన్ అమ్మాయిని ప్రేమించడమా?

హసన్ పై కోపాన్ని పెంచుకుంది. తండ్రితో తన బాధను చెప్పుకుంది. మంత్రి అజీజ్ కూడా హసన్ కు చెప్పి చూసాడు. హసన్ కూడదన్నాడు. భూలోక సుందరి అయిన తన కుమార్తె జీనత్ ప్రేమను తిరస్కరించి, తన మాటను కాదని ఒక సాధారణ భారతీయ స్త్రీని ప్రేమించి పెళ్ళాడతాను అంటున్న హసన్ ను సమస్యల్లోకి నెట్టాలని భావించాడు. రాజు దృష్టిలో అతడిని దోషిగా నిలబెట్టాలని ప్రణాళికలు వేసుకున్నాడు మంత్రి అజీజ్.

జీనత్ కూడా తండ్రికి వంత పాడి విషం కక్కింది. ప్రేమ నిస్వార్థమయినది. కానీ జీనత్ తన ప్రేమ కోసం జీవితాలను విచ్ఛిన్నం చేయాలనుకుంది. ప్రేమించిన హసన్ ను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టాలనుకుంది.

మంత్రి అజీజ్ కూడా హసన్ పై పగ పెంచుకుని అవకాశం కోసం ఎదురుచూస్తూ ఎలాగయినా హసన్ కు బుద్ధి చెప్పాలని భావించాడు అజీజ్. గులాబి రేకులను అక్కడ పడేసి నగలన్నీ దోచుకుని తీసుకెళ్ళిపోయాడు. రాజ మందిరంలోని అన్ని గదులూ, రాణివాసాలూ, అంత:పురాలు, రహస్య మందిరాలన్నీ మంత్రికి బాగా తెలుసు.

అందుకే ఆయనకు రాకుమారి అమీనా మందిరంలోకి చొరబడి నగలను దొంగిలించడం సులభతరం అయింది.

అనుకున్నవిధంగా హసన్ మీదకే అనుమానం మరలింది. తండ్రికూతుళ్ళు సంతోషించారు. కానీ వాళ్ళు డిటెక్టివ్ ఖాలిద్ ను తక్కువ అంచనా వేసారు

ఉన్నపళంగా వెళ్ళి అజీజ్ ఇంటిలో వెతికాడు. దాచిన నగలు అక్కడ బయటపడ్డాయ్. రాజు ఊపిరి పీల్చుకున్నాడు. మంత్రి అజీజ్ ను పదవీచ్యుతుడిని చేసి, రాజవంశం మీదే కుట్రలు చేసిన తండ్రీ కూతుళ్ళకు దేశ బహిష్కరణ శిక్ష విధించాడు

హసన్ సంతోషించాడు.

అయితే, ప్రజల ముందు ఈ విషయం బయటపెట్టకుండా, కొడుకు హసన్ కోరికను మన్నించి, అతడు ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి రాజు అనుమతించారు.

యువరాణి అమీనా పెళ్లితో పాటూ కొడుకు పెళ్ళిని కూడా అదే వేదికపై ఘనంగా జరిపించారు. అందరూ సంతోషించారు. కానీ, ఈ సంఘటన రాజుకు కనువిప్పు కలిగించింది.

ప్రేమకు పేదగొప్ప తేడా లేదని కులమత ప్రాంతీయ భేదాలులేవని గ్రహించాడు. ప్రేమికులను విడదీస్తే పరిణామాలు తీవ్రంగా వుంటాయని కూడా భావించాడు. బంధుమిత్రులే కాక పట్టణ ప్రజలు కూడా సంతోషించి హర్షధ్వానాలతో శుభాకాంక్షలను తెలియజేసారు.

(మరోకథ వచ్చేనెల)

Post your comments